# నిర్మాణదారులు మన ఇసుక వాహనంతోనే దరఖాస్తు చేసుకోవాలి

- మన ఇసుక వాహనం, వెబ్‌సైట్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు
- నేరుగా కూపన్లు ఇచ్చే విధానం రద్దు
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**ప్రజానావ, సిరిసిల్ల :** నిర్మాణాదారులు ఇసుక కోసం "మన ఇసుక వాహనం" ద్వారా ఆన్లైన్ లోనే దరఖాస్తు చేసుకోవాలని సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సెంటర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన "మన ఇసుక వాహనం" అప్లికేషన్, ఆన్లైన్ వెబ్ సైట్ లో నిర్మాణదారులు ద్వారా తమకు నచ్చిన ఇసుక రీచ్ నుంచి ఇసుక బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకోవడం చాలా సులభమని పేర్కొన్నారు. నిర్ణీత పత్రాలు జత చేస్తే ఇసుక పొందవచ్చని స్పష్టం చేశారు. జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్ ల నుంచే ఇసుక తరలించవచ్చని, ఇసుక తరలింపులో నేరుగా కూపన్లు ఇచ్చే విధానం రద్దు అయిందని వెల్లడించారు. ఆన్లైన్ ద్వారా పొందే విధానం అమలు చేస్తున్నామని, ఇసుక కేటాయింపు, తరలింపు పూర్తి పారదర్శకంగా ఉంటుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. మధ్యవర్తుల అవసరం లేకుండా ప్రజలు నేరుగా ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకునే సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో కల్పించిందని, దీనివల్ల అక్రమ రవాణా నివారించబడుతుందని పేర్కొన్నారు. అలాగే మన ఇసుక వాహనం విషయమై సమాచారం, వివరాలు తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ 040- 23120421/8333923732 ఫోన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయని, మెయిల్ ఐడీ "helpdesk.tsmiv@cgg.gov.in" సేవలు ఉన్నాయని తెలిపారు. ఇసుక బుక్ చేసుకునేటప్పుడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అధికారి జారీ చేసిన ధ్రువపత్రం, ఇతర ఇంటి నిర్మాణానికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి, అధికారి జారీ చేసిన ఇంటి నిర్మాణ అనుమతి పత్రం, ప్రభుత్వ పనులకు సంబంధిత కార్య నిర్వహణ ఇంజనీర్ జారీ చేసిన అనుమతి పత్రం (అప్లోడ్ చేసే డాక్యుమెంట్స్ 200 కేబీ లోపల ఉండాలని పీడీఎఫ్, జేపీజీ విధానంలో ఉండాలి) తెలిపారు. నిర్మాణదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఇసుక పొందాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పిలుపు నిచ్చారు.

# విద్యార్థినిలు వేధింపులపై నిర్భయంగా సంప్రదించండి

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
- మహిళలను వేధిస్తున్న పోకిరీలపై మార్చ్ నెలలో 3 కేసులు, 4 పెట్టి కేసులు నమోదు
- విద్యాసంస్థల్లో ఈవ్‌టీజింగ్, పోక్సో, ర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమాలు




**ప్రజానావ, సిరిసిల్ల :** మహిళల, విద్యార్థినుల భద్రతను కాపాడేందుకు జిల్లాలో షీ టీమ్ బృందం నిరంతరం చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని మహిళలకు, విద్యార్థినులకు సూచించారు. మార్చి నెలలో షీ టీమ్‌కు అందిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటూ మూడు ఎఫ్ఐఆర్ లు, నాలుగు పెట్టి కేసులు నమోదు చేయడం జరిగింది. మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వ్యక్తులను గుర్తించి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. మహిళలు, విద్యార్థినులు ఎక్కడైనా వేధింపులకు గురైనప్పుడు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు, బస్టాండ్ లు, విద్యా సంస్థలు, ఉద్యోగ ప్రదేశాల్లో ఎవరైనా అవహేళనగా మాట్లాడినా, వెంబడించినా వెంటనే షీ టీమ్‌కు నెంబర్ 8712656425 కు ఫిర్యాదు చేయాలని, ప్రతి ఫిర్యాదుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. షీ టీమ్ బృందం జిల్లాలో ఉన్న విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో ర్యాగింగ్, ఇవ్‌టీజింగ్, పోక్సో, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారని, ముఖ్యంగా విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని, ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం ఉండాలని సూచించారు.

# ఢిల్లీలో 'టాయ్ కారు' పేలుడు కుట్ర భగ్నం

- ఇద్దరు జైష్ ఉగ్రవాదుల అరెస్ట్
- మహారాష్ట్ర ఏటీఎస్, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- ముంబై, థానేలలో నిందితుల గుర్తింపు



**ప్రజానావ, ముంబై:** దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నిన 'జైష్-ఎ-మహ్మద్' ఉగ్రవాద సంస్థ వ్యూహాన్ని భద్రతా దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయి. మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం, ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన మెరుపు దాడుల్లో ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులు పట్టుబడ్డారు. నిందితులు భద్రతా దళాల కళ్లుగప్పి దాడులు చేసేందుకు ఒక 'బొమ్మ కారు'ను ఎంచుకోవడం గమనార్హం. రద్దీగా ఉండే ప్రాంతాల్లో రిమోట్ కంట్రోల్ సాయంతో నడిచే ఈ బొమ్మ కారులో పేలుడు పదార్థాలను అమర్చి, రిమోట్ ద్వారా పేల్చాలని వారు ప్రణాళిక వేశారు. నిఘా వర్గాల నుంచి అందిన ముందస్తు సమాచారంతో పోలీసులు ఆదివారం అర్ధరాత్రి ముంబైలోని కుర్లా, థానేలోని ఖడవలి ప్రాంతాల్లో దాడులు చేసి వీరిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిని మోసాబ్ అహ్మద్ (అలియాస్ కామ్రాన్/సోను), మహమ్మద్ హమద్ కల్రా (బడా ఇమ్రాన్)గా గుర్తించారు. ప్రాథమిక విచారణలో వీరికి పాకిస్థాన్‌కు చెందిన జైష్-ఎ-మహ్మద్ సంస్థతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు తేలింది. వీరి వద్ద నుంచి కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియా మరియు ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా సరిహద్దు అవతల ఉన్న హ్యాండ్లర్లు వీరిని ప్రభావితం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ ద్వారానే వీరికి శిక్షణ ఇచ్చి, ఢిల్లీలో దాడులు చేయాలని ఆదేశించినట్లు సమాచారం. అరెస్ట్ చేసిన నిందితులను ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీకి తరలిస్తున్నారు. అక్కడ వారిని కోర్టులో హాజరుపరిచి, తదుపరి విచారణ నిమిత్తం కస్టడీకి తీసుకోనున్నారు. ఈ కుట్రలో స్థానిక స్థాయిలో ఎవరైనా సహకరించారా? అన్న కోణంలో స్పెషల్ సెల్ దర్యాప్తు చేస్తోంది. సమయానుకూలంగా పోలీసులు స్పందించడంతో ఢిల్లీలో సంభవించాల్సిన ఒక పెద్ద విపత్తు తప్పిందని రక్షణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

# నవీ ముంబైలో నకిలీ బాబా అరాచకం

- క్షుద్రపూజల పేరిట మహిళలపై అత్యాచారం
- ఫామ్‌హౌస్‌కు పిలిపించి లైంగిక దాడి
- చేతబడి భయంతో బెదిరింపులు
- నిందితుడు అబ్దుల్ రషీద్ అరెస్ట్



**ప్రజానావ, ముంబై:** ఆధ్యాత్మికత పేరుతో అమాయక మహిళలను నమ్మించి, వారిపై లైంగిక దాడికి పాల్పడుతున్న మరో నకిలీ బాబా ఉదంతం నవీ ముంబైలో వెలుగులోకి వచ్చింది. అబ్దుల్ రషీద్ అలియాస్ 'బాబాజాన్' అనే మోసగాడు క్షుద్రపూజల నెపంతో మహిళలు, బాలికలపై అత్యాచారాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడు అబ్దుల్ రషీద్ తొలుత ప్రజలకు తత్వశాస్త్రం బోధిస్తూ, వారి నమ్మకాన్ని చూరగొనేవాడు. మహిళల ఆర్థిక, సామాజిక, వైవాహిక సమస్యలను పరిష్కరిస్తానని, వారిపై ఉన్న 'చేతబడి'ని తొలగిస్తానని నమ్మించేవాడు. చేతబడి వదిలిస్తాననే సాకుతో బాధితులను ఖాలాపూర్‌లోని ఒక నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న ఫామ్‌హౌస్‌కు ఏకాంతంగా పిలిపించేవాడు. అర్ధరాత్రి పూజల పేరుతో మహిళల దుస్తులు తొలగించి, వారు ప్రతిఘటిస్తే ప్రాణభయంతో భయపెట్టి అఘాయిత్యాలకు పాల్పడేవాడు. శాంతాక్రూజ్‌కు చెందిన ఒక తల్లి మరియు ఆమె కుమార్తెపై నిందితుడు అత్యాచారం చేయడమే కాకుండా, వారిని చంపడానికి కూడా ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ దారుణాలపై ఇద్దరు మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కలంబోలిలోని తన నివాసంలో కూడా ఈ నకిలీ బాబా తరచూ ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించేవాడు. జనాల రద్దీ పెరగడంతో స్థానిక సొసైటీ సభ్యులు అతడిని ఇల్లు ఖాళీ చేయమని కోరారు. కేసు నమోదైన విషయం తెలుసుకున్న నిందితుడి కుటుంబ సభ్యులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఈ మోసగాడి బారిన ఇంకా చాలా మంది మహిళలు పడి ఉండే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో బాధితులు బయటకు వచ్చి ఫిర్యాదు చేసేలా 'ముస్లిం సత్యశోధక్ మండల్' (ట్రూత్ సీకర్స్ బోర్డ్) కీలక పాత్ర పోషించింది. మతం పేరుతో మోసాలకు పాల్పడే ఇటువంటి వ్యక్తులకు ఏ రాజకీయ పార్టీ కూడా మద్దతు ఇవ్వకూడదని ఈ సందర్భంగా బోర్డు విజ్ఞప్తి చేసింది. ప్రజలు మూఢనమ్మకాలతో మోసగాళ్ల వలలో పడవద్దని పోలీసులు హెచ్చరించారు.



# కవి బూర దేవానందంకు గజల్ కవిగా గుర్తింపు

## గజల్ సదస్సులో సత్కారం

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన కవి బూర దేవానందం కు గజాలు కవిగా గుర్తింపు లభించింది. ఈ మేరకు హైదరాబాద్ రవీంద్ర భారతి లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు సాహిత్య అకాడమీ, 'స్వరవల్లరి' తెలుగు గజల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పలువురు గజల్ కవులను ప్రత్యేకంగా ఆహ్వానించి గజల్ సదస్సు నిర్వహించారు. ఈ గజల్ సదస్సుకు సిరిసిల్ల గజల్ కవి, బూర దేవానందం కు కూడా ఆహ్వానం అందడం ప్రశంసనీయం. సినారే పదాల అల్లికను పునికి పుచ్చుకున్న గజల్ కవిగా గుర్తింపు. ఆ సదస్సులో కవి, బూర దేవానందం తను రచించిన గజల్ "పరిపాలన గతి తప్పితే అరాచకం తెలుసుకో!" "సుపరిపాలన సాగితే అభ్యుదయం తెలుసుకో!! వినిపించించి ఆహుతులను, అలరించారు, ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు 'స్వరవల్లరి' తెలుగు గజల్ అకాడమీ ' అధ్యక్షురాలు, హిమజా రామం 'లయన్' మిరియాల విజయలత జస్టిస్, మల్యాద్రి చేతులమీదుగా సత్కారం పొందడం విశేషం. కవి, బూర దేవానందం ను జిల్లా రచయితల సంఘం, మానేరు రచయిల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి,అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గం అభినందించారు.

# రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు వేసినందుకు భారీ జరిమానా



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే చర్యల్లో భాగంగా మున్సిపల్ అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం చంద్రంపేట 12వ వార్డులో రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేసిన వ్యక్తికి 5,000 రూపాయల భారీ జరిమానా విధించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చెత్తను, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయడం వల్ల ప్రజారోగ్యానికి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య నియమాలను పాటించాలని, చెత్తను మున్సిపల్ వాహనాలకే అందించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా వదిలేది లేదని, భారీ జరిమానాలతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్‌తో పాటు మున్సిపల్ జవాన్ ప్రవీణ్, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిరిసిల్ల బీఎస్పీ పట్టణ అధ్యక్షునిగా తడక భాను నియామకం



**ప్రజానావ, సిరిసిల్ల :** బీఎస్పీ పార్టీ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షునిగా తడక భాను నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షులు కొమ్మాట అశోక్ ఈ మేరకు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేసి, భానుకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నేతలు ఎనుగుందుల వెంకన్న (రాష్ట్ర కార్యవర్గ సభ్యులు), ఎడ్ల అరుణ్ కుమార్ (నియోజకవర్గ అధ్యక్షులు), కొమ్మెట వేణు (నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి), కట్కూరి నాగరాజు (బివిఫ్ కన్వీనర్) వెంగళ ఆంజనేయులు, పార్టీ బలోపేతమే లక్ష్యం తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా అధ్యక్షులకు, రాష్ట్ర నాయకత్వానికి తడక భాను కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, ప్రజా సమస్యలపై పోరాడుతూ సిరిసిల్ల పట్టణంలో బీఎస్పీ జెండాను రెపరెపలాడిస్తానని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

